క్లుప్తంగా

గాయత్రిలో చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. శనివారం నాటికి 36 వేల 481 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

బోనాల ఊరేగింపు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఆదివారం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గంగమ్మతల్లికి బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా గంగపుత్రులు ఇంటికో బోనం చొప్పున బోనం తీశారు. అనంతరం గ్రామం నుంచి పొలిమేరలో గల గంగమ్మ ఆలయం వరకు ఊరేగించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గంగపుత్ర సంఘం ప్రతినిధులు బాబయ్య, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న మదన్ మోహన్‌రావు ఎన్నికల్లో భారీ మెజార్టీ సాధించి విజయం సాధించడంతో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. శాలువాలతో సన్మానించారు. రాజన్న, రాజేందర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలుపొందిన ఎమ్మెల్యే మదన్ మోహన్

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా మదన్‌మోహన్ రావు కామారెడ్డి జిల్లాలోనే అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా మదన్‌మోహన్ రావు 24,001 మెజారిటీ రాగా, బాన్సువాడ నుంచి గెలుపొందిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి 23 , 464 ఓట్ల మెజారిటీ సాధించారు. కామారెడ్డిలో బీజేపీ ఎమ్మెల్యేగా కాటిపల్లి వెంకటరమణారెడ్డి 6 వేల 741 ఓట్ల మెజారిటి సాధించగా, జుక్కల్ ఎమ్మెల్యేగా గెలిచిన తోట లక్ష్మీకాంతరావు 1,152 ఓట్లతో గెలుపొందారు.

బాన్సువాడలో బీజేపీకి పెరిగిన ఓట్లు

బాన్సువాడ: నియోజకవర్గంలో గతంలో కంటే ఈ సారి ఎన్నికల్లో బీజేపీకి ఎక్కువగా ఓట్లు పోలయ్యాయి. 2018లో బీజేపీకి 2,960 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ 38 ఓట్లతో కలిపి 2,998 ఓట్లు వచ్చాయి. ఈ సారి ఎన్నికల్లో 23,334 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్‌లో 351 ఓట్లతో కలిపి 23,685 ఓట్లు పోలయ్యాయి. గతంలో కంటే ఈ సారి ఎన్నికల్లో బాన్సువాడలో బీజేపీకి ఓట్ల శాతం పెరిగింది. యువకులు ఎక్కువగా బీజేపీ వైపే మొగ్గు చూపినట్లు తెలిసింది.

అర్చరీలో జాతీయ పోటీలకు ఎంపిక



దోమకొండ: గుజరాత్‌లో జరిగే ఎస్‌జీఎఫ్ అర్చరీ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలకు దోమకొండకు చెందిన క్రీడాకారుడు అనుదీప్ ఎంపికైనట్లు అర్చరీ కోచ్ ప్రతాప్‌దాస్ ఆదివారం తెలిపారు. ఈనెల 2న వరంగల్ జిల్లా తొర్రూర్‌లో జరిగిన అండర్-17 ఎస్‌జీఎఫ్ పోటీల్లో అనుదీప్ మూడో స్థానంలో నిలిచినట్లు ఆయన వివరించారు. ఈ నెల 17,18,19 తేదీల్లో గుజరాత్‌లో జరిగే పోటీల్లో పాల్గొనడానికి ఎంపికై నట్లు పేర్కొన్నారు. క్రీడాకారుడు అనుదీప్‌ను అర్చరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కామినేని అనిల్ కుమార్, కార్యదర్శి సంజీవ్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రసూల్, నిజామాబాద్ జిల్లా కార్యదర్శి నర్సింహారెడ్డి, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు తిర్మల్‌గౌడ్, కార్యదర్శి మోహన్‌రెడ్డి తదితరులు అభినందించారు.

కేబుల్ కనెక్షన్ల కట్.. విద్యుత్ సరఫరా బంద్

భిక్కనూరు: కామారెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి గెలవడంతో బీజేపీ కార్యకర్తలు ఆదివారం సంబురాలు జరుపుకున్నారు. ఎన్నికల ఫలితాల గురించి ఎప్పటికప్పుడు టీవీల్లో వార్తలు ప్రజలు చూస్తుండటంతో కొందరు గిట్టక కేబుల్ కనెక్షన్‌ను మండల కేంద్రంలో మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం 6 వరకు తొలగించారు. దీంతో టీవీ ప్రసారాలకు అంతరాయమేర్పడింది. దీంతో కేబుల్ వినియోగదారులు, నిర్వాహకులకు ఫోన్ చేసి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో నిర్వాహకులు తమ ఫోన్లను స్విచ్ఛాఫ్ చేశారు.తమను అప్రతిష్టపాలు చేసేందుకు కొందరు కేబుల్‌ను కత్తిరించారని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే బీజేపీ కార్యకర్తలు మండల కేంద్రంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించుకుంటుండగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. గంట పాటు విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కల్గింది.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు



రామారెడ్డిలో సంబురాలు చేసుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు



మాగి గ్రామంలో ..

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచిన చోట ఆదివారం కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు చేసుకున్నాయి. జిల్లాలో ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్ రావు, జుక్కల్ నుంచి తోట లక్ష్మీకాంతరావు గెలుపొందారు. దీంతో కార్యకర్తలు, నాయకులు టపాసులు పేల్చి సంతోషం వ్యక్తం చేశారు. ఊరూరా స్వీట్లు పంచుతూ భారీ ర్యాలీలు నిర్వహించారు. - సాక్షి నెట్‌వర్క్



ఎల్లారెడ్డిపల్లి తండాలో..



రాజంపేటలో టపాసులు పేలుస్తూ..



గున్కుల్‌లో..



నాగిరెడ్డిపేట మండల పరిధిలో..



తాడ్వాయి మండల కేంద్రంలో..



పిట్లంలో..



బేగంపూర్ గ్రామంలో..



పెద్దకొడప్‌గల్‌లో..



బిచ్కుందలో..



మద్నూర్‌లో ..



ఎల్లారెడ్డిలో..

కేవీఆర్ గెలుపు.. బీజేపీకి ఊపు



బీబీపేటలో సంబురాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి నియోజకవర్గం నుంచి హేమాహేమీల మీద బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి(కేవీఆర్) సంచలన విజయం సాధించారు. దీంతో గ్రామగ్రామాన బీజేపీ నేతలు, కార్యకర్తలు టపాసులు పేల్చి సంబురాలు చేసుకున్నారు. ఊర్లలో విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. భారత్ మాతాకీ జై, బీజేపీ జిందాబాద్ నినాదాలతో హోరెత్తించారు. – సాక్షి నెట్‌వర్క్





పెద్దమల్లారెడ్డిలో..



దోమకొండలో ..



దేవునిపల్లిలో..



మాచారెడ్డిలో ..

మూడు పాఠశాలలకు ఒకే మరుగుదొడ్డి

- విద్యార్థులు, ఉపాధ్యాయులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు



బాలికల పాఠశాలలోని మరుగుదొడ్డి

బిచ్కుంద(జుక్కల్): ప్రభుత్వం మన ఊరు– మన బడి పథకం కింద అన్ని వసతులు కల్పించాలని రూ.కోట్ల నిధులు మంజూరు చేసినా అధికారుల అసమర్థత, నిర్లక్ష్యం వల్ల పాఠశాలలో మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, ప్రాథమికోన్నత బాలుర పాఠశాల, బాలికల జెడ్పీహెచ్‌ఎస్‌లకు కలిపి ఒకే మరుగుదొడ్డి ఉంది. బాలికల పాఠశాలలో ఉన్న మరుగుదొడ్డి శిథిలావస్థకు ఉంది. అందులో దుర్వాసన రావడంతో నిరుపయోగంగా మారింది. మరుగుదొడ్లు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు నానా అవస్థలు పడుతున్నారు. గణేష్ మందిర్ ప్రాథమిక పాఠశాలలో 180 మంది, బాలుర హైస్కూల్‌లో 307 మంది విద్యార్థులు, బాలికల హైస్కూల్‌లో 243 మంది విద్యార్థినులు ఉన్నారు. ప్రాథమిక పాఠశాలలో కొత్తగా నిర్మించిన మరుగుదొడ్డిని మూడు పాఠశాలలకు చెందిన 730 మంది విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు ఒకే మరుగుదొడ్డిని వాడుతున్నారు. వందల మంది ఒకే మరుగుదొడ్డిని ఎలా వాడుకోవాలని, చాలా కష్టంగా ఉందని మహిళా ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరుగుదొడ్డి కోసం క్యూలో నిలబడాల్సి వస్తుందని, చాలా అవమానంగా ఉందని, డీఈవోకు మా సమస్యలు విన్న వించినా పట్టించుకోవడం లేదన్నారు. బాలుర హైస్కూల్‌లో మరుగుదొడ్డి నిర్మాణం చేస్తామని కూల్చేసి స్లాబ్ వేసి వదిలేశారు. నెలల గడుస్తున్నా అసంపూర్తిగా ఉన్నాయి..పర్యవేక్షించాల్సిన పీఆర్ ఏఈ పట్టించుకోవడం లేదు. నాసిరకం పనులు జరుగుతున్నా అటువైపు అధికారులు కన్నెత్తి చూడడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యూలో నిలబడలేక, ఆపుకోలేక కొందరు బహిర్భూమికి ఆరుబయటకు వెళ్తున్నారు. మరి కొందరు ఇంటికి వెళ్లిపోతున్నారు. కలెక్టర్ స్పందించి వసతులు కల్పించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

పోచారం స్వగ్రామంలో సందడి



పోచారం తండాలో సంబురాలు చేసుకుంటున్న గ్రామస్తులు



బాన్సువాడలోని బీడీవర్కర్స్ కాలనీలో..

బాన్సువాడ రూరల్: బాన్సువాడ ఎమ్మెల్యేగా మరోసారి భారీ మెజార్టీతో పోచారం శ్రీనివాస్‌రెడ్డి గెలుపొందడంతో ఆయన స్వగ్రామం పోచారం, పోచారం తండాల్లో గ్రామస్తులు సంబురాలు చేసుకున్నారు. టపాసులు కాల్చి హర్షం వ్యక్తం చేశారు. స్వీట్లు పంచుకున్నారు. అలాగే మండల కేంద్రంలోని బీడీ వర్కర్స్ కాలనీవాసులు టపాసులు కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. అలాగే పలు గ్రామాల్లో పోచారం శ్రీనివాస్‌రెడ్డి అభిమానులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు వీధుల్లోకి వచ్చి టపాసులు కాల్చారు.

ప్రజల నిర్ణయం శిరోధార్యం

- మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజల తీర్పు శిరోధార్యమని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసినా ప్రజలు మార్పు కోరుకున్నారని అన్నారు. ఏదేమైనా ప్రజలు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని చెప్పారు.

ప్రజల ఆశీర్వాదంతోనే విజయం

- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోట లక్ష్మీకాంతరావ్



పిట్లం(జుక్కల్): ప్రజల ఆశీర్వాదంతో విజయం సాధించానని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన జుక్కల్ నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రేవంత్ రెడ్డి ఆశీర్వాదంతో జుక్కల్ నియోజకవర్గంలో అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. సాగు, విద్య, వైద్యంతో పాటు అన్ని మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. విజయానికి కృషి చేసిన మండల నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. నేతలు లక్ష్మీకాంత్ రావ్‌ను కలిసి ఘనంగా సన్మానించి శుభకాంక్షలు తెలిపారు.

‘ప్రజాతీర్పును శిరసావహిస్తా’



మాట్లాడుతున్న ఏనుగు రవీందర్‌రెడ్డి

బాన్సువాడ రూరల్: బాన్సువాడ అసెంబ్లీ స్థానానికి ఈ నెల 30న జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందిన ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం బాన్సువాడలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో విజయం కోసం అహర్నిశలు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలు, ఓటేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినందున బాన్సువాడలో కూడా గెలిస్తే మరింత అభివృద్ధి జరిగే అవకాశం ఉండేదన్నారు. ఎన్నికల ప్రచారం ప్రారంభించడానికి ముందు తిరుమల ఆలయం వద్ద హామీ ఇచ్చినట్లు తాను బాన్సువాడలోనే ఇల్లు కట్టుకుని స్థానికంగా ఉంటూ కార్యకర్తకు అండగా నిలుస్తానన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలను సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీలుగా గెలిపించుకోవడానికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఓటమికి ప్రధాన కారణమేదని విలేకరులు అడుగగా గతంలో ఇక్కడ బీజేపీ అభ్యర్థికి 3 వేల ఓట్లు వచ్చాయి.. ఈసారి 23వేల ఓట్లు వచ్చాయి. ప్రజావ్యతిరేక ఓటు చీలిక జరిగినట్లు భావిస్తున్నామన్నారు. అలాగే తనకు చివరి ఎన్నికలంటూ బీఆర్‌ఎస్ అభ్యర్థి సెంటిమెంట్‌ను పండించడం వల్ల ప్రజలు కరిగిపోయి ఉండవచ్చన్నారు. నాయకులు యలమంచలి శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, ప్రతాప్‌సింగ్, శివరాజ్ దేశాయ్,వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కుక్కలతో పరేషాన్!



మద్నూర్‌లో కుక్కల గుంపు

మద్నూర్(జుక్కల్): కుక్కలతో ప్రజలు పరేషాన్ అవుతున్నా జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడంతో ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయి. ప్రజలు ఇళ్ల నుంచి బయటికి వెళ్లాలంటేనే జంకుతున్నారు. మండల కేంద్రంలో కుక్కలు ఎక్కువ కావడంతో మనుషులపై దాడులు చేస్తున్నాయి. ఇటీవల కాలంలో మద్నూర్ మండల కేంద్రంలో రెండు సార్లు కుక్కల గుంపు గ్రామస్తులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. అందులో చిన్నారులు సైతం ఉన్నారు. కుక్కల దాడి జరగడం వారు ఆస్పత్రుల వెళ్లడం పరిపాటిగా మారిన వాటిని అరికట్టడానికి సరైన చర్యలు తీసుకోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు నెలల క్రితం కొన్ని కుక్కలను మాత్రమే పట్టుకొని వెళ్లి మిగిలిన కుక్కలను వదిలివేయడంతో సమస్యలు పునరావృతమవుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుర్తింపు ఉన్న నేతలు లేకున్నా..

భిక్కనూరు: మండలంలో బీజేపీకి గుర్తింపు ఉన్న నాయకులు ఎవరూ లేకున్నా ఆపార్టీకి మండలంలో ఏకంగా గత అసెంబ్లీ ఎన్నికల కంటే ఈ సారి 65.33 శాతం ఓట్లను పెంచుకుంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి మండలంలో 1,512 ఓట్లు రాగా నేడు వెలువడిన ఫలితాల్లో ఆ పార్టీకి 9,879 ఓట్లు వచ్చాయి. బీజేపీ తరపున అప్పుడు పోటీ చేసిన కాటిపల్లి వెంకటరమణారెడ్డే ఇప్పుటి బీజేపీ అభ్యర్థి అవడం గమనార్హం. అలాగే గత అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి టీఆర్‌ఎస్ పార్టీకి భిక్కనూరు మండలంలో 12,850 ఓట్లు రాగా నేడు 9,798 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీకి 2018 అసెంబ్లీ ఎన్నికల్లో భిక్కనూరు మండలంలో 11,831 ఓట్లు రాగా నేడు 11,289 ఓట్లు వచ్చాయి. మండలంలో బీజేపీకి గుర్తింపు ఉన్న నాయకులు లేకున్నా కార్యకర్తలు ప్రజల ఆధరాభిమానాలే ఆ పార్టీకి 65.33 శాతం ఓట్లను తెచ్చిపెట్టిందని చెప్పవచ్చు.

మూడో స్థానంలో బీఆర్‌ఎస్

భిక్కనూరు: మండలంలో అధికార బీఆర్‌ఎస్ పార్టీ మూడో స్థానానికి పడిపోయింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో మొదటి స్థానంలో ఉన్న అప్పటి టీఆర్‌ఎస్ నేడు బీఆర్‌ఎస్‌గా మారి ఫలితాల్లో మండలంలో మూడవ స్థానానికి చేరుకుంది. మండలంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రేవంత్‌రెడ్డికి 11,289 ఓట్లు, బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణరెడ్డికి 9,879 ఓట్లు రాగా బీఆర్‌ఎస్ అభ్యర్థి సీఎం కేసీఆర్‌కు 9,798 ఓట్లు పోలయ్యాయి. బస్వాపూర్, గుర్జకుంట, లక్ష్మీదేవునిపల్లి, ర్యాగట్లపల్లి గ్రామాల్లో మొదటి స్థానంలో బీఆర్‌ఎస్ నిలిచింది. మోటాట్‌పల్లి, శ్రీసిద్ధరామేశ్వరనగర్, భిక్కనూరు, జంగంపల్లి గ్రామాల్లో బీజేపీ మొదటి స్థానంలో నిలిచింది. కాచాపూర్, పెద్దమల్లారెడ్డి, అయ్యవారిపల్లి, కంచర్ల, ఇసన్నపల్లి, భాగిర్తిపల్లి, మల్లుపల్లి, రామేశ్వర్‌పల్లి, తిప్పాపూర్, అంతంపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ మొదటి స్థానంలో నిలిచింది.

ఎన్నికల్లో గెలుపోటములు సహజం



కామారెడ్డిలో మాట్లాడుతున్న బీజేపీ నేత వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): రాజకీయ రంగంలో గెలుపోటములు సహజమని ఎల్లారెడ్డి బీజేపీ అభ్యర్థి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి ప్రజలు తనకు చాలా వరకు ఓట్లు వేశారని వారందరికి ధన్యవాదాలని తెలిపారు. తన గెలుపు కోసం కష్టపడిన కార్యకర్తలు, నాయకులకు రుణపడి ఉంటానన్నారు. రానున్న రోజులలో బీజేపీ గెలుపు కోసం కార్యకర్తలు మరింత కష్టపడి పని చేసి గెలుపు సాధించాలని అన్నారు.